
సాక్షి
వరంగల్

శనివారం । 29 । మార్చి । 2025



పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఉండవు
- వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన


'సాక్షి' ఫోన్‌ఇన్‌లో సమస్యలు వింటున్న కమిషనర్ సుధీర్‌కుమార్

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్ర త్యేక శ్రద్ధ తీసుకున్నామని, మురుగు కాల్వలను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపడతామని వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ ఇ.సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డుపై వాహనాల నిలిపివేత, తాగునీటి కొరత, కోతులు, కుక్కలతో బెడద, వేసవిలో తాగునీటి కొరత తదితర సమస్యలపై పట్టణ ప్రజలు కమిషనర్ దృష్టికి ఫోన్‌లో తీసుకువచ్చారు. ఈ సమస్యలపై స్పందించిన కమిషనర్ వెంటనే పరిష్కరించే పనులు చేపడుతున్నామని సిబ్బందిని అప్రమత్తం చేసి ఆయా పనులకు పురమాయించారు. ఇతర పనులు కొన్ని దశల వారీగా చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రశ్న: మురుగు కాల్వ ఎత్తు తగ్గి ప్రధాన కాల్వ ఎత్తు కావడంతో మురుగు నీరు నిల్వ ఉంటుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అలాగే కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి.

–చేపూరి శ్రీధర్, వర్ధన్నపేట 1వ వార్డు

కమిషనర్: తాత్కాలిక పనుల్లో భాగంగా మురుగు నీరు నిల్వ లేకుండా వెంటనే తొలగించే ఏర్పాటు చేస్తాం. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో పనులు చేపడతాం.

ప్రశ్న: తాగునీటి బోరు బావి మోటారు మరమ్మతుకు తీసుకెళ్లారు. ఇంత వరకు బోరు బావికి ఏర్పాటు చేయలేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం.

–భూక్య గోరా, డీసీ తండా, 6వ వార్డు

కమిషనర్: బోరుకు సంబంధించిన మోటారు మరమ్మతుకు తీసుకెళ్తే ఆ మోటారు పనికి రాదన్నారు. వెంటనే కొత్త మోటారు కొనుగోలు చేసి బోరు బావికి బిగించే ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: కేవలం ప్రధాన వీధుల్లో మాత్రమే పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. కాలనీల్లో కూడా పారిశుద్ధ్య పనులు చేయాలి. ఇంటి పన్నుల వసూళ్లకు డిమాండ్ రిజిస్టర్‌తో రావడం లేదు. పట్టణంలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు, చెత్తా చెదారం పేరుకు పోతోంది. పాత మున్సిపాలిటీ భవనం గ్రంథాలయానికి అప్పగించాలి.

–ఏవీ శేష శయనం, 9వ వార్డు, వర్ధన్నపేట

కమిషనర్: ప్రధాన వీధులు కాకుండా మిగతా వీధుల్లో కూడా పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. ఇంటిపన్నుల వసూళ్లకు డిమాండ్ రిజిస్టర్ వెంట ఉండేలా చర్యలు తీసుకుంటాం. పాత మున్సిపల్ భవనం మున్సిఫ్ కోర్టుకు వినియోగించే అవకాశం ఉంది.

ప్రశ్న: వర్ధన్నపేట ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకోవడంతో పాటు వాహనాలను నిలపడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

–వెంకటేశ్వర్‌రావు, పిరంగిగడ్డ, వర్ధన్నపేట, యాంసాని శ్రీధర్, 2వ వార్డు, కత్తి రాజశేఖర్, 2వ వార్డు, పూజారి రాజు, 8వ వార్డు

కమిషనర్: ఇప్పటికే ఆయాషాపుల యజమానులకు నోటీసులు జారీ చేశాం. ఫుట్‌పాత్ ఆక్రమణ, వాహనాల నిలపకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: పట్టణంలో కుక్కలు, కోతులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

– బందారి యాకయ్య, 7వ వార్డు, చందు నాగరాజు, 8వ వార్డు, కొండేటి కిరణ్, 10వ వార్డు

కమిషనర్: కుక్కలకు స్టెరిలైజేషన్ చేయడానికి ఇప్పటికే కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. వెంటనే కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తాం. కోతులను పట్టించి అడవుల్లో వదిలే విధంగా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: ఇంటిగ్రేటెడ్ మార్కెట్, దోబి ఘాట్, డీసీతండాలో శ్మశానవాటిక పనులు ఎందుకు జాప్యం అవుతున్నాయి.

– ఆకుల మనోజ్, వర్ధన్నపేట, పిరంగిగడ్డ

కమిషనర్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్, శ్మశానవాటిక పనులు సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు అందక మధ్యలో పనులు నిలిచిపోయాయి. దోబీ ఘాట్ వద్ద కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి కలెక్టర్‌కు ప్రతిపాదన పంపాం. దోబీ ఘాట్‌లో యంత్రాలు ఏర్పాటు కావాల్సి ఉంది. వాటి కోసం చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న: ఎల్‌ఆర్‌ఎస్ విషయం అడగడానికి వస్తే అందుబాటులో ఉండడం లేదు.

–పూజారి రాజు, 8వ వార్డు

కమిషనర్: తాను పర్యటనలో ఉన్న సమయంలో వచ్చి ఉంటారు. డివిజన్లలో రోజు పర్యటిస్తున్నా. అందుబాటులో లేకుంటే అవసరమైతే ఫోన్ చేయండి. పరిష్కార మార్గం తెలుపుతాము.

ప్రశ్న: పాత ఎస్‌బీఐ నుంచి మోటపోతుల వారి ఇళ్ల ఎదుట ఉన్న పాత మసీదు వరకు గత సంవత్సర కాలంగా మురుగు కాల్వ తీయకపోవడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. 11వ వార్డులో కూడా మురుగు కాల్వలో నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తుంది.

– నాగెల్లి సురేష్, 1వ వార్డు, పొన్నం రాకేష్, 11వ వార్డు

కమిషనర్: వెంటనే మురుగు కాల్వలో ఉన్న చెత్త, మురుగు నీరును తొలగించే ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: వర్ధన్నపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఎదుట వాహనాల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– కొండేటి కిరణ్, 10వ వార్డు

కమిషనర్: ఇప్పటికే బ్యాంకు అధికారులకు నోటీసులు జారీ చేశాం. తదుపరి చర్యలు తీసుకుని వాహనాలు రోడ్డుపై నిలవకుండా తగు చర్యలు తీసుకుంటాం.

దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్: దివ్యాంగుల గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ (యూడీఐడీ) కార్డులను జారీ చేస్తుందని, ఈ కార్డులు ఉన్న వారికి మాత్రమే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూడీఐడీ కార్డులపై సంబంధితశాఖ అధికారులకు, సిబ్బంది, దివ్యాంగులకు డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే సదరం సర్టిఫికెట్ తీసుకున్న వారికి యూడీఐడీ కార్డులను ఆటోమేటిక్‌గా జనరేట్ చేసి వారి ఇంటికి పంపిస్తారన్నారు. కొత్తగా సర్టిఫికెట్ కావాల్సిన వారు, సదరం సర్టిఫికెట్ గడువు ముగిసి రెన్యూవల్ చేసుకోవాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూడీఐడీ కార్డుతో దివ్యాంగులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. దివ్యాంగులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.స్వావలంబన్‌కార్డు.జీఓవీ.ఇన్ లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, నర్సంపేట మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, అధికారులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బద్దిపోచమ్మ జాతర


బద్దిపోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న భక్తులు

నల్లబెల్లి: రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే కూన వంశీయుల ఆరాధ్యదైవం బద్దిపోచమ్మతల్లి జాతరను మండలంలోని బొల్లోనిపల్లి శివారు పోచంపల్లి గ్రామంలో శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి కూన నారాయణస్వామి, రమలు ప్రత్యేక పూజలు చేయగా భక్తులు బోనాలు, ప్రభబండ్లు, డప్పు చప్పుళ్లతో బయలు దేరగా మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న బోనం సమర్పించారు. ప్రభబండ్లు డీజే సౌండ్స్‌తో యువకుల నృత్యాల మధ్య గ్రామంలో ఉత్సాహంగా ఊరేగింపు జరిగింది. జాతరకు వచ్చిన భక్తులకు దేవాలయ పరిసరాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాజీ


మొక్కులు చెల్లిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సాయిరమణ, ఎస్సై గోవర్ధన్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

నర్సంపేట/గీసుకొండ: గ్రామాల్లోని మహిళా రైతులు సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డి, హరిప్రసాద్‌బాబు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 2024–25వ సంవత్సరంలో ఎస్ఎంఏఎం కింద మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని మహిళా రైతులు యంత్ర పరికరాలకు నేడు(శనివారం) సాయంత్రం వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. బ్యాటరీ స్ప్రేయర్‌లు ఐదు జనరల్ 3, ఎస్సీ 1, ఎస్టీ 1, పవర్ స్ప్రేయర్‌లు ఐదు జనరల్ 3, ఎస్సీ 1, ఎస్టీ 1, రోటోవేటర్లు రెండు జనరల్ 1, ఎస్సీ 1, డిస్క్ హారో/కల్టీ వేటర్లు మూడు జనరల్ 1, ఎస్సీ 1, ఎస్టీ, ట్రాక్టర్ 1 ఎస్టీ సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారం, ఆధార్, పట్టా పాస్‌బుక్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆయా మండల కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

దేశానికి ఒకే ఎన్నిక మేలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



గీసుకొండ: భారత దేశానికి ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం మేలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక, బీజేపీ దృష్టికోణం అనే విషయంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే ఎన్నికతో సందద పెరిగి ఖర్చు తగ్గుతుందని, ఎన్నికల కమిషన్‌పై భారం తగ్గుతుందని, రాజకీయ స్థిరత్వం ఏర్పడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి బాకం హరిశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కో కన్వీనర్లు రేసు శ్రీనివాస్, పేర్ల అనిల్‌కుమార్, కుసుమ సతీష్, గురుమూర్తి, శివకుమార్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో 8 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు 11 పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ డిగ్రీ కాలేజీ పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ 8 మంది పట్టుబడ్డారు. వారు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ తెలిపారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు సులువు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా సులువుగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, వరంగల్ ఎస్ఈ కె.గౌతంరెడ్డి తెలిపారు. ఈయాప్ ద్వారా బిల్లుల చెల్లింపు సులభతరం, సురక్షితం, సౌకర్యవంతమన్నారు. ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించాలని సూచించారు. ఎన్పీడీసీఎల్ యాప్, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా హనుమకొండ సర్కిల్‌లో 1,32,806 వినియోగదారులు, వరంగల్ సర్కిల్‌లో 63,529 మంది తమ నెల వారీ విద్యుత్ బిల్లులు డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లిస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ శాఖలోని ఉమ్మడి వరంగల్ జిల్లా వరంగల్ ఆర్వో, జనగామ, భూపాలపల్లి, పరకాలలో విధులు నిర్వహిస్తున్న పలువురు జూనియర్ అసిస్టెంట్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను బదిలీ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఆర్వోలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను జనగామకు, పరకాలలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని వరంగల్ ఆర్వోకు, భూపాలపల్లిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను వరంగల్ ఆర్వోకు బదిలీ చేశారు.

ఎస్‌హెచ్‌జీలకు ఊరట!

- బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీ మంజూరు
- 2024 ఏప్రిల్ నుంచి పది నెలల బకాయిలు విడుదల
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 48,717 సంఘాలకు రూ. 92.74 కోట్లు


గీసుకొండలో సమావేశమైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

గీసుకొండ: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలు వడ్డీ బకాయిల కోసం చేస్తున్న నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు తాజాగా ప్రభుత్వం పది నెలల వడ్డీ బకాయిలను విడుదల చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన వడ్డీ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించింది. గతంలోని బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో సకాలంలో వడ్డీ బకాయిలు విడుదల కాకపోవడంతో పొదుపు సంఘాల మహిళలు ఇబ్బందులు పడ్డారు. 2019 నుంచి 2022 వరకు మూడేళ్ల వడ్డీ నిధులు మంజూరు చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2023–24 సంవత్సరానికి నాలుగు నెలల బకాయిలను కొన్ని నెలల క్రితం విడుదల చేశారు. అయితే కేవలం నాలుగు నెలల బకాయిలను విడుదల చేసి మిగతా నెలలవి మంజూరు చేయకపోవడంతో పొదుపు సంఘాల వారు నిరాశకు లోనయ్యారు. తాజాగా 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు పది నెలల వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భాగమైన ఆరు జిల్లాల్లోని 48,717 సంఘాలకు రూ.92.74 కోట్ల బకాయిలను విడుదల చేయడంతో సంఘాల వారికి ఊరట లభించింది.

స్వయం ఉపాధికి ఊతం

మహిళా సంఘాల్లోని సభ్యులు బ్యాంకు లింకేజీ కింద తీసుకున్న వడ్డీ లేని రుణాల (వీఎల్ఆర్)తో ఆర్థికంగా ఎదగటంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రభుత్వం సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పలువురు చిన్న తరహా పరిశ్రమలు, యూనిట్లను నెలకొల్పుతున్నారు. క్యాంటీన్ల ఏర్పాటు, పెరటి కోళ్ల పెంపకం, గేదెల పోషణ, కిరాణం, క్లాత్‌స్టోర్లు, టైలరింగ్, సానిటరీ న్యాప్కిన్‌ల తయారీ తదితరాలను ఎంచుకుని ఆదాయం పొందుతూ రాణిస్తున్నారు. అలాటి వారికి వడ్డీ బకాయిలను ప్రభుత్వం సకాలంలో అందిస్తే మరింత ఉత్సాహంతో ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

పాత బకాయిల చెల్లింపు ఊసే లేదు..

ఇదిలా ఉండగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన వడ్డీ బకాయిలు అలాగే పేరుకుపోయాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన హయాం నుంచి వడ్డీ బకాయిలు విడతల వారీగా చెల్లిస్తూ వస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన భారీ మొత్తంలోని బకాయిల గురించి ఎవరూ ఊసెత్తడం లేదు. అటు అధికారులు, ప్రభుత్వం దీనిపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో అయోమయం నెలకొంది.

ఏప్రిల్ 2024 నుంచి 2025 జనవరి వరకు విడుదలైన వడ్డీ బకాయిలు

జిల్లా పేరు	లబ్ధిపొందిన సంఘాలు	వీఎల్ఆర్ మొత్తం (కోట్లలో.)
వరంగల్	9,347	21.02
హనుమకొండ	8,369	18.48
జనగామ	8,905	16.34
మహబూబాబాద్	11,083	17.65
ములుగు	5,165	9.07
జేఎస్‌భూపాలపల్లి	5,848	10.18
మొత్తం	48,717	92.74

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జెడ్పీ సీఈఓ రాంరెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

గీసుకొండ: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం కొనాయమాకులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను మండల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల విషయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం స్కీంపై యువతకు అవగాహన కలిగించాలన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గంలో 12 వేల మందికి శిక్షణ ఇచ్చి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగం పొందేలా చేయడానికి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. తహసీల్దార్ రియాజుద్దీన్ ఎంపీడీఓ కృష్ణవేణి, హౌసింగ్ పీడీ వి.గణపతి, డీఈ కిషన్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఎం సురేశ్‌కుమార్, ఏపీఓ చంద్రకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాజీపేట డివిజన్ ఆశలపై నీళ్లు!?

- ఉన్నఫలంగా 185 మంది లోకో రన్నింగ్ కార్మికుల సంఖ్య తగ్గింపు
- ఉత్తర్వులు జారీచేసిన దక్షిణ మధ్య రైల్వే
- స్థానిక రైల్వే క్రూ లాబీ నిర్వీర్యమయ్యే ప్రమాదం
- గతంలోనే క్రూ లింక్‌ల తరలింపు..
- ఆందోళనలో కాజీపేట రన్నింగ్ స్టాఫ్
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని విజ్ఞప్తి


కాజీపేట రైల్వే లోకోపైలెట్ల క్రూ డిపో కేంద్రం

కాజీపేట రూరల్: ఉత్తర, దక్షిణ దేశప్రాంతాలకు గేట్ వేగా ఉంటున్న కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్ కేంద్రంగా కాకుండా కొందరు ప్రయత్నిస్తున్నారా.. అంటే తాజా పరిణామాలు చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. ఇందులోభాగంగానే ముందస్తు ఆలోచనతో గతంలో క్రూలింక్‌లను విజయవాడకు తరలించడం.. తాజాగా లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్ల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం వల్ల కాజీపేట డివిజన్ కలను క్రమక్రమంగా నిర్వీర్యం చేస్తున్నారన్న విషయం స్పష్టమవుతోంది. ఇక్కడి ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వేడివిజన్ అయితే ఉన్నతాధికారులు విజయవాడ, సికింద్రాబాద్ విడిచి స్థానికంగానే ఉండాల్సి వస్తుందన్న ఆలోచనతో ముందస్తుగా అడ్డురాయి వేసినట్లు స్థానిక లోకోపైలెట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని అర్హతలు ఉన్నా.. అడ్డంకులు

నిజాం రైల్వే కాలంలో ఏర్పాటైన కాజీపేట జంక్షన్ దినాదినాభివృద్ధి చెంది ఒక డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు సంపాదించుకుంది. ఉద్యోగాల సంఖ్య పెరగడంతో పాటు స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశతో ఉన్నారు. ఈ క్రమంలోనే రైల్వే వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీలు రావడంతో ప్రజల ఆశలు పెరిగాయి. తదనంతరం కాజీపేట రైల్వే డివిజన్‌కు అడుగులు పడుతున్న నేపథ్యంలో కొందరు రైల్వే అధికారులు కాకుండా కుట్రకు పాల్పడుతున్నారని లోకోపైలెట్లు, రైల్వే నాయకులు అంటున్నారు.

ఒక్కొక్కటిగా..

కాజీపేటకు గుండెకాయలాంటి విభాగమైన రైల్వే డ్రైవర్ల కార్యాలయం కేంద్రంగా పనిచేస్తున్న లోకోపైలెట్లపై కన్ను వేశారు. వీరి సంఖ్యను తగ్గిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు లోకోపైలెట్లకు శుక్రవారం సమాచారం అందింది. గతంలో కాజీపేట నుంచి క్రూ లింక్‌లను విజయవాడకు తరలించడంతో లోకోపైలెట్లు, స్థానిక సంఘాలు, రాజకీయ పార్టీలు, రైల్వే నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయగా కొన్ని రైళ్లను వాడి, బీదర్ సెక్షన్‌లనుంచి ఇక్కడికి కేటాయించి కంటి తుడుపు చర్యలు చేపట్టారు. కొంతకాలం తర్వాత ఆ రైళ్లను కూడా వేరే డిపోనకు తరలించి కాజీపేటను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

లోకోపైలెట్ల పోస్టులను తగ్గిస్తూ...

కాజీపేట క్రూ డిపో కేంద్రంగా 2020లో 623మంది లోకోపైలెట్లతో నడిచింది. 2023 నవంబర్ నాటికి ఆ సంఖ్య 501కి తగ్గింది. 2025 మార్చి నాటికి 470 పోస్టులకు పడిపోయింది. ఈ విధంగా రోజు రోజుకూ కాజీపేట క్రూ డిపో స్థాయిని తగ్గిస్తున్నట్లు లోకోపైలెట్లు ఆందోళన చెందుతున్నారు. 2020లో కేటాయించిన పోస్టుల సంఖ్య 790 కాగా బుధవారం నాడు అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 542 పోస్టులకు పడిపోయిందని, గత 5 ఏళ్లలో 248 పోస్టులు తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గూడ్స్ లోకోపైలెట్ల సంఖ్య సైతం తగ్గింపు..

కాజీపేట క్రూ డిపో కేంద్రంగా గూడ్స్ లోకోపైలెట్ల పోస్టులను కూడా తగ్గిస్తున్నారని లోకోపైలెట్లు అంటున్నారు. గూడ్స్ లోకోపైలెట్ల నుంచి సీనియార్టీ ప్రకారం పదోన్నతి కల్పిస్తూ ప్యాసింజర్ లోకో పైలెట్, మెయిల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. కానీ, విజయవాడలో ఉన్న సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన క్రూ డిపోలో ఖాళీలను పెంచి భర్తీ చేశారని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల కాజీపేటకు చెందిన సంబంధిత కోచింగ్ ఖాళీల్లో గూడ్స్ లోకోపైలెట్లు 30మంది పనిచేస్తున్నారని తెలిపారు. అధికారులు రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో కాజీపేట రైల్వే క్రూ డిపో స్థాయి రోజురోజుకూ తగ్గుతుందని లోకోపైలెట్లు ఆందోళన చెందుతున్నారు.

విశాఖ రైల్వేజోన్ కోసమేనా?

విశాఖపట్టణం కేంద్రంగా నూతన రైల్వే జోన్ ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో ఈ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు కొందరు అధికారులు ఇదంతా చేస్తున్నారని లోకోపైలెట్లు అంటున్నారు. విజయవాడ డివిజన్ విశాఖ రైల్వే జోన్ పరిధిలోకి వస్తుందని, కాజీపేటలో లోకోపైలెట్ల సంఖ్యను తగ్గించి వారిని విజయవాడలో సికింద్రాబాద్‌కు చెందిన లోకోపైలెట్లుగా పనిచేస్తున్న డిపోలలో కలుపుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైన ఉమ్మడి జిల్లా ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, రైల్వే ట్రేడ్ యూనియన్ల నాయకులు రైల్వే జీఎం, రైల్వే బోర్డుపై ఒత్తిడి తీసుకవచ్చి కాజీపేట క్రూ డిపోను నిర్వీర్యం కాకుండా, కాజీపేట డివిజన్ ఏర్పాటు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని లోకోపైలెట్లు కోరుతున్నారు.

తరలించిన రైల్వే క్రూ లింక్‌లను ఇవ్వాలి



కాజీపేట క్రూ లాబీ కేంద్రంగా గూడ్స్ లోకోపైలెట్ల రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫార్లను తీసి కాజీపేట క్రూ డిపోలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. కాజీపేట డిపో ప్రాధాన్యతను తగ్గించకుండా, తగ్గించిన లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్ల పోస్టులను భర్తీ చేయాలి. కాజీపేట నుంచి విజయవాడకు తరలించిన లింక్‌లను తిరిగి వెనక్కి తీసుకురావాలి.

- పాక రాజ్‌కుమార్, కాజీపేట సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్

కాజీపేట రైల్వే డిపోను కాపాడాలి



కాజీపేట రైల్వే డిపోలో 700 పైచిలుకు ఉన్న మంజూరు పోస్టులను భర్తీ చేయకుండా 3 ఏళ్ల నుంచి 500 పోస్టులతో నడిపిస్తున్నారు. గత మూడేళ్లుగా పదోన్నతులు లేవు, పోస్టులు లేవు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకుని కాజీపేట క్రూ డిపోను కాపాడాలి.

- సంగ రమేశ్, కాజీపేట సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ లోకోరన్నింగ్ బ్రాంచ్ చైర్మన్

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట: పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసి గుడిసె వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఎస్‌పీ, డీబీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, ప్రజా దండోరా వ్యవస్థాపకుడు అందె రవి అధ్యక్షతన గుడిసె వాసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద ఫొటోతో ముద్రించిన ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో పేదలు ఉంటున్న గుడిసెలకు విద్యుత్, మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, తదితర సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ భూములు రక్షించి పేదల స్వాధీనంలోని భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, మాలతి, లత, రవి, విమల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీన అండర్ –19 ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారిలో నలుగురు బాలురు, నలుగురు బాలికలను మే నెలలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పేర్ల నమోదు, వివరాల కోసం 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష రాసిన టెన్త్ విద్యార్థి


పరీక్ష రాసి వస్తున్న రోహిత్

కమలాపూర్: తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థి పదో తరగతి పరీక్ష రాశాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లికి చెందిన ముత్తినేని రోహిత్.. కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో పరీక్ష సెంటర్ పడింది. రోహిత్ తండ్రి వెంకట్రావు (50) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, అదేరోజు సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. తండ్రి అంత్యక్రియలు పూర్తైన మరునాడు శుక్రవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉండడంతో పుట్టెడు దుఃఖంలోనూ విద్యార్థి రోహిత్ హాజరయ్యాడు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- మరొకరికి స్వల్ప గాయాలు
- స్కూటీని లారీ ఢీ కొట్టడంతో ఘటన


బండి కీర్తి (ఫైల్)

ఎల్కతుర్తి: ఓ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా లారీ నడిపిన ఘటనలో యువతి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం శాంతినగర్ సమీపంలోని హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన బండి కీర్తి (24) బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. విధుల్లో భాగంగా కీర్తి తన సహోద్యోగి చందనతో కలిసి స్కూటీపై కరీంనగర్ జిల్లా తాడికల్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని శాంతినగర్ సమీపంలో (జీజే06 బీటీ 8139) నంబర్ గల లారీ హుజూరాబాద్ నుంచి ఎల్కతుర్తి వైపు వస్తున్న క్రమంలో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి స్కూటీని బలంగా ఢీకొట్టాడు. దీంతో వెనుక కూర్చున్న కీర్తి కింద పడడంతో ఆమెపై నుంచి లారీ ఎక్కడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన కీర్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి బండి రాజు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈసారీ లోటు బడ్జెటేనా..?

కేయూ అంచనా బడ్జెట్ రూ.428 కోట్లపైనే..

- బ్లాక్‌గ్రాంట్ కింద రూ.145.62 కోట్ల కేటాయింపు
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.31 కోట్లు
- మౌలిక సదుపాయల కల్పనకు రూ.50 కోట్లు
- నేడు కేయూ 40వ అకడమిక్ సెనెట్ సమావేశం



కేయూ క్యాంపస్: 2025 – 2026వ ఆర్థిక సంవత్సరానికి కాకతీయ యూనివర్సిటీ అంచనా బడ్జెట్ సుమారు రూ.428 కోట్లకు పైగా ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 29న కాకతీయ యూనివర్సిటీ 40వ అకడమిక్ సెనెట్ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి బ్లాక్‌గ్రాంట్ కింద రూ.145.62 కోట్లు కేటాయించింది. ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కేవలం టీచింగ్, నాన్ టీచింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలకే సరిపోతోంది. అలాగే, ఈసారి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మరో రూ.31 కోట్లు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరం (2024 – 2025)లో బ్లాక్ గ్రాంట్ కింద కాకతీయ యూనివర్సిటీకి రూ.134.94 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.145.62 కోట్లు కేటాయించటంతో గత సంవత్సరంతో పోలిస్తే సుమారు రూ.10 కోట్ల నిధులు పెంచడంతో కొంత ఊరట లభించినట్లయింది.

విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ ఆలస్యమే

యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, పెన్షనర్లకు వేతనాల కింద బ్లాక్‌గ్రాంట్‌గా నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం.. ప్రొఫెసర్ల సర్వీస్ పూర్తయ్యాక, ఉద్యోగ విరమణ పొందితే మాత్రం వారికి వచ్చే వివిధ బెనిఫిట్స్ నిధులు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదు. అంతర్గత నిధుల ద్వారానే చెల్లింపులు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకు విరమణ పొందుతున్న ఉద్యోగులు, ప్రొఫెసర్లకు బెనిఫిట్స్‌ను కొంత ఆలస్యంగానైనా యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచే చెల్లిస్తున్నారు. ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 60ఏళ్ల నుంచి 65ఏళ్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో మరో ఐదేళ్ల పాటు ఉద్యోగ విరమణలు ఉండవు.

రెగ్యులర్ కంటే పెన్షనర్లే ఎక్కువ

ప్రస్తుతం యూనివర్సిటీలో 77 మంది రెగ్యులర్ అధ్యాపకులుండగా, కాంట్రాక్టు లెక్చరర్లు 179, పార్ట్‌టైం లెక్చరర్లు 205 మంది వరకు పనిచేస్తున్నారు. పెన్షనర్లు (అధ్యాపకులు) 254 మంది ఉండగా, ఫ్యామిలీ పెన్షనర్లు 79 మంది వరకు ఉన్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగులు 365 మంది, 33 మంది టైంస్కేల్ ఉద్యోగులు, పెన్షనర్లు 450 మంది, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 507 మంది ఉన్నారు.

రూ.8 కోట్లు లోటు బడ్జెట్ చూపే అవకాశం

కేయూలో 2024 – 2025వ ఆర్థిక సంవత్సరంలో రూ.431 కోట్లకుపైగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025 – 2026లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ 145.62 కోట్లతోపాటు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్‌కు రూ.31 కోట్లు, డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.50 కోట్లు అంతర్గత నిధుల ద్వారా ఇతరత్రా వనరుల ద్వారా రాబడి కొంత ఎక్కువగానే వస్తుందని భావించి, రూ.428 కోట్లకు పైగా బడ్జెట్ ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. వ్యయం కూడా అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో రూ.8 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల విభాగం, అకడమిక్ పరంగా వచ్చే ఫీజులు, ఎస్‌డీఎల్‌సీఈ (దూరవిద్య కేంద్రం) ద్వారా వచ్చే నిధులు, యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల అఫిలియేషన్ల ద్వారా వచ్చే ఫీజులు, పరీక్షల ఫీజులు, అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీ, ఇతర వనరుల ద్వారా రాబడి వస్తుందని అంచనా వేసే అవకాశాలున్నాయి. 2023–2024లో యూనివర్సిటీ బడ్జెట్ రూ.15.47 కోట్లు లోటు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024 – 2025లో రూ.11 కోట్లకుపైగా లోటు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2025 – 2026లో రూ.8 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపెట్టే అవకాశాలున్నట్లు సమాచారం.

మొక్కుబడిగా అకడమిక్ సెనెట్ సమావేశం

కాకతీయ యూనివర్సిటీలో అకడమిక్ సెనెట్ అత్యంత కీలకమైంది. ఇందులో అకడమిక్ విద్యాపరమైన అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. కొత్త కోర్సులు, సిలబస్ మార్పులు చేర్పులు, పరిశోధనలకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలి, ఇతర యూనివర్సిటీల్లో ఎలాంటి అకడమిక్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి, కాకతీయ యూనివర్సిటీలో విద్యాపరమైన అంశాలపై ప్రత్యేకంగా చర్చలు జరగాల్సి ఉంటుంది. అయితే, దశాబ్దంన్నర కాలంగా అకడమిక్ సెనెట్ సమావేశం మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. పేరుకు అకడమిక్ సెనెట్ సమావేశం అని చెప్పి అందులోనే కేయూ అంచనాల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.

అభివృద్ధి కోసం రూ.50 కోట్లు

కాకతీయ యూనివర్సిటీలో వివిధ సదుపాయలు, అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో మరో రూ.50 కోట్లు కేటాయించింది. గత 11 ఏళ్లుగా అభివృద్ధి కోసం నిధులు రావడం లేదు. గత ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆ తరువాత విడుదల చేయలేదు. ఈసారి ఇప్పటి ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేస్తే అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పనకు వినియోగించే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

నిర్దిష్ట సంఖ్యతో ఉండే అకడమిక్ సెనెట్ ఏది?

అకడమిక్ సెనెట్‌లో ఉండే సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారం అకడమిక్ సెనెట్‌లో వీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మాజీ వీసీలు, అన్ని విభాగాల డీన్లు, పాలక మండలి సభ్యులుగా ఉన్నారు. సమాజంలో వివిధ రంగాల్లోని వారు కూడా సభ్యులుగా ఉండవచ్చు. సెనెట్‌ను అలా పునర్ వ్యవస్థీకరిస్తే 100మందికి పైగా సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం 21మంది సభ్యులతోపాటు కాకతీయ యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పరీక్షల విభాగం అధికారులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తున్నారు.

బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రొఫెసర్ సురేష్‌లాల్

కాకతీయ యూనివర్సిటీ 40వ అకడమిక్ సెనెట్ సమావేశాన్ని పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. 2023 – 2024 వార్షిక నివేదిక, 2024 – 20245 కేయూ స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. 2025 – 2026 అంచనాల బడ్జెట్‌ను కేయూ ఎకనామిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్, పాలక మండలి సభ్యుడు సురేష్‌లాల్ ప్రవేశపెట్టనున్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, సెనెట్ సభ్యులు పాల్గొననున్నారు.

జీఎస్టీ బకాయి చెల్లింపులపై జరిమానా మాఫీ

వరంగల్: జీఎస్టీ అమలులోకి వచ్చిన తొలి మూడేళ్లలో బకాయి ఉన్న వినియోగదారులు ఈనెల 31వ తేదీలోపు చెల్లించిన వారికి జరిమానా, వడ్డీని మాఫీ చేస్తున్నట్లు వరంగల్ జిల్లా వాణిజ్య పన్నుల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2017 – 18, 2018 – 19, 2019 – 20వ సంవత్సరాలకు గాను మదింపు చేసిన పన్ను మొత్తాన్ని చెల్లిస్తే దానిపై వేసిన జరిమానా (పెనాల్టీ), వడ్డీ మాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అప్పీలేట్ అథారిటీ, కోర్టులో ఛాలెంజ్ చేసిన మదింపు ఉత్తర్వులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈనెల 31లోపు పన్ను చెల్లించి, జూన్ 30లోపు జీఎస్టీ పోర్టల్‌లో సదరు దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గడువు సమీపిస్తుండడంతో ఆసక్తి గల పన్ను చెల్లింపుదారులు దరఖాస్తుతో నిమిత్తం లేకుండా గడువులోగా పన్నులు చెల్లించాలని సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారని వివరించారు. మరిన్ని వివరాలకు జీఎస్టీ అధికారులను సంప్రదించాలని పన్నుల అధికారి కోరారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


సాయి (ఫైల్)

నెక్కొండ: ప్రేమించిన యువతి కాదనడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముదుసు లక్ష్మి – నర్సింహస్వామి దంపతుల రెండో కుమారుడు సాయి (26).. అదే గ్రామానికి చెందిన ఓ యువతితో కొంతకాలంగా ప్రేమలో పడ్డాడు. హైదరాబాద్‌లో ఇద్దరు వేర్వేరుగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారి వివాహానికి పెద్దలు ఇటీవల అంగీకరించారు. అయితే, సాయిని వివాహం చేసుకోవడం ఇష్టం లేక ఆ యువతి దూరం పెట్టింది. దాంతో మనస్థాపానికి గురైన అతను ఈనెల 27న రాత్రి 2 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే సాయి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆ సబ్ ఇంజనీర్ల టర్మినేషన్‌కు నిర్ణయం?

- అక్రమంగా ఎంపికైన వారికి నోటీసులు జారీ
- నేరుగా అభ్యర్థులకు చేరవేత

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో అక్రమంగా నియామకమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ ఇంజనీర్లను టర్మినేట్ చేయాలని యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు నోటీసులు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో చేపట్టిన సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో భారీగా అక్రమాలు జరిగిన విషయం విదితమే. నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాటు భర్తీ చేసిన నియామకాల్లోనూ అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెలుగు చూశాయి. సబ్ ఇంజనీర్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి అర్హులైన అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సచివాలయంలోని ప్రజాపాలనలోనూ వినతులు అందజేశారు. ఈ క్రమంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ వేయగా, రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు, అక్రమాలు జరిగాయని కమిటీ గుర్తించింది. 24 మందిని నిబంధనలకు విరుద్ధంగా భర్తీ చేశారని విచారణలో తేల్చింది. వారికి శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విచారణ కమిటీ నివేదిక ప్రకారం టర్మినేషన్ ఎందుకు చేయకూడదో తెలపాలంటూ ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న సబ్ ఇంజనీర్లకు ఉన్నతాధికారులు నోటీసులు చేశారు. 15 రోజుల్లో సమాధానం చెప్పాలని ఆ నోటీసులు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నోటీసులోని అంశాలు బహిర్గతం కాకుండా నేరుగా అభ్యర్థులకే చేరవేస్తున్నారు. ఈ విషయంపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని వివరణ కోరగా నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారు సంజాయిషీ ఇచ్చుకోవడానికి కొంత సమయం ఇచ్చామని, వారు ఇచ్చిన సమాధానాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని వరుణ్‌రెడ్డి వివరించారు.

9.5 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

తొర్రూరు: నిషేధిత గంజాయి తరలిస్తున్న ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై జి.ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన వికాస్ పీతంబర్ మోతె, నరేష్ పాండురంగ కలిసి ఒడిశా నుంచి 9.5 కిలోల ఎండు గంజాయిని సొంత రాష్ట్రానికి తరలించేందుకు తొర్రూరు బస్టాండ్‌లో శుక్రవారం దిగారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వారి వద్ద తనిఖీ చేయగా గంజాయి లభించింది. దాని విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

1,200 ఎకరాల్లో సభ నిర్వహణ

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్, పక్కన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు

హన్మకొండ: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో లక్షలాది మందితో బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా పార్టీ ఆవిర్భావం రోజు ఏప్రిల్ 27న 1,200 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎల్కతుర్తిలో 150 ఎకరాల్లో సభ నిర్వహణ, 1,050 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. ఆర్టీసీ, ఇతర వాహనాలు కలిపి 40 వేల నుంచి 50 వేల వాహనాలు రావచ్చని అంచనా వేశామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వొడితల సతీష్‌బాబు, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, నాయకులు గ్యాదరి బాలమల్లు, నాగూర్ల వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మర్రి యాదవరెడ్డి, తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.


అనుమతి కోసం కాజీపేట ఏసీపీకి దరఖాస్తు ఇస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బీఆర్‌ఎస్ సభ అనుమతికి దరఖాస్తు

ఎల్కతుర్తి: ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వేదిక ఖరారైంది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, సతీష్ బాబు తదితరులు శుక్రవారం సభాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం సభ నిర్వహణ, భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర అనుమతుల కోసం కాజీపేట ఏసీపీ తిరుమల్‌ను నేతలు కలిసి దరఖాస్తు ఇచ్చారు.

చేప పిల్లల పెంపకంతో లాభాలు

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న
- ముగిసిన ఐదు రోజుల శిక్షణ శిబిరం

మామునూరు: చేప పిల్లల నర్సరీ, పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, వరంగల్ జిల్లా మత్స్య అధికారి నాగమణి అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ఆధ్వర్యంలో జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో ఐదు రోజులుగా జరుగుతున్న కార్ప్ చేప పిల్లల పెంపకంపై శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా చేపల పెంపకాన్ని కొనసాగించాలని సూచించారు. చేపల పెంపకంతో పాటు చేప పిల్లల ఉత్పత్తి ఆవశ్యకతను వివరించారు. చేప పిల్లల పెంపకంతో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణార్థులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గణేష్, సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

అప్పుల బాధతో ఇద్దరి బలవన్మరణం


హుస్సేన్ (ఫైల్)

గూడూరు: అప్పుల బాధ తాళలేక ఓ రైతు క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కోబల్‌తండా శివారు మూడుగుడిసెల లైన్‌తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బానోతు హుస్సేన్ (34).. భార్య సరిత, ఇద్దరు కొడుకులతో కలిసి వ్యవసాయంతో పాటు ట్రాలీ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ ఖర్చులు, వ్యవసాయం, ఆటో కొనడానికి రూ.5 లక్షలు అప్పు చేశాడు. వ్యవసాయంలో ఆదాయం రాకపోగా, ఆటో నడపినా గిరాకీ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పు ఎలా తీర్చాలో అని గత కొన్ని రోజులుగా భార్యతో చెప్పుకుంటూ మదనపడుతుండే వాడు. ఈ క్రమంలో సోమవారం ఆటోలో వెళ్లిన హుస్సేన్.. మర్రిమిట్ట సమీపంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి గూడూరు సీ హెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీ ఎంకు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి హుస్సేన్ మృతిచెందాడు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీత్లాతండాలో వ్యవసాయ కూలీ..

మహబూబాబాద్ రూరల్: అప్పుల బాధతో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని సీత్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఈరియా తండాలో శుక్రవారం జరిగింది. రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపిన వివరాల ప్రకారం ఈరియా తండాకు చెందిన బానోతు రవి (35) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో అప్పులు పెరిగిపోగా, వాటిని ఎలా తీర్చాలో తెలియక ఈనెల 25న మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం రవి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నూతన ఔషధాలు కనిపెట్టాలి

కేయూ క్యాంపస్: ఫార్మసీ రంగంలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయని, ఇంకా నూతన ఔషధాలను కనుగొనాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సూచించారు. హనుమకొండలో వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ఎథికల్ రెస్పాన్సిబులిటీస్ ఆఫ్ స్టూడెంట్స్ రీసెర్చర్స్ ఇన్ హ్యాండ్లింగ్ ఆఫ్ ఎక్స్‌పరిమెంటల్ ఎనిమల్స్ ఇన్ ఫార్మలాజికల్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న సైంటిఫిక్ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వరవణభవ, డాక్టర్ గిరిజ, శ్రవణ్‌కుమార్, కుమారస్వామి, మహేష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తి బతికున్నట్లు సృష్టి

- 13ఏళ్లుగా రూ.45 లక్షల మేర పెన్షన్ స్వాహా?
- అదే పేరు కలిగి ఉన్న వృద్ధుడితో లైఫ్ సర్టిఫికెట్
- హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి: 13 ఏళ్ల క్రితం ఓ పెన్షనర్ చనిపోయాడు. కానీ, మరణించిన పెన్షనర్ పేరు కలిగి ఉన్న ఓ వృద్ధుడిని తెరపైకి తీసుకొచ్చి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించుకుంటూ పెన్షన్ పొందుతూ వచ్చారు. ఈ మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే హసన్‌పర్తికి చెందిన వేల్పులు రాములు తండ్రి కొంరయ్య పంచాయతీరాజ్ శాఖలో నాలుగో తరగతి ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందాడు. నెలనెలా పెన్షన్ పొందుతున్నాడు. అతను 2012లో మృతిచెందాడు. కానీ, కుటుంబసభ్యులు రాములు మృతి చెందినట్లు ట్రెజరీశాఖకు సమాచారం ఇవ్వలేదు.

అదే పేరుతో ఉన్న వృద్ధుడిని తెరపైకి..

అదే కాలనీలో వేల్పుల రాములు తండ్రి కొంరయ్య అనే వృద్ధుడు ఉన్నాడు. నాలుగో తరగతి ఉద్యోగి రాములు చనిపోయిన విషయాన్ని కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచి అదే కాలనీలోని రాములు పేరు గల వృద్ధుడిని తెరపైకి తీసుకొచ్చారు. ప్రతీ ఏడాది లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడంతో ప్రతినెలా పెన్షన్ డబ్బులు ఆ బ్యాంక్‌లో జమవుతున్నాయి. ఇప్పటివరకు సుమారు రూ.45లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వెలుగు చూసింది ఇలా..

ఆసరా పెన్షన్ పొందుతున్న రాములుకు ఏడాది క్రితం పెన్షన్ నిలిపివేశారు. దీంతో అతని మనుమడు కార్తీక్ ఈ విషయమై అధికారుల చుట్టూ తిరగగా, తన తాత సర్వీస్ పెన్షన్ పొందుతున్నట్లు వెల్లడైంది. తన తాత ఎలాంటి ప్రభుత్వం ఉద్యోగం చేయలేదని, మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడని పోలీసులకు తెలిపారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఆటో ఢీ.. వృద్ధుడికి తీవ్రగాయాలు

కాజీపేట అర్బన్: రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆటో ఢీ కొట్టగా వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓరుగల్లు పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది చైతన్య, బాలాజీ నాయక్ కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురానికి చెందిన 60 ఏళ్ల చల్లపల్లి బాబురావు హంటర్‌రోడ్డులోని ఓ హాస్టల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వ్యక్తిగత పని మీద ఓరుగల్లు పెట్రోల్ బంక్ ప్రాంత వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని ఆటో అతన్ని ఢీ కొట్టింది. దాంతో బాబురావు ఎడమ కాలు పూర్తిగా విరిగి నుజ్జునుజ్జయింది. 108 అంబులెన్స్‌లో అతన్ని ఎంజీఎంకు తరలించారు.